పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

హైదరాబాద్, మార్చి 20: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. హైదరాబాద్‌లోని బాలాపూర్ రోడ్డు, ధాతు నగర్ కమ్యూనిటీ హాల్, రోడ్ నం.10, జై జగదాంబ ట్రేడర్స్ ఎదురుగా ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, 23 తేదీల్లో నాలుగు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు.

చికిత్స పొందిన మహిళ మాటల్లో: గతంలో ఒక మహిళ పులిపిర్లతో (అంతర్గాలు) ఎవరికి చూపించలేక బాధపడుతుండగా స్త్రీలకు ఇక్కడ ప్రత్యేకంగా సేవలు అందిస్తున్నారని తెలిసి ఇక్కడికి రాగా పరిష్కారం లభించడంతో సంతోషంగా ఉందని తెలిపారు. మరి కొందరితో చర్చించి చికిత్సను గురించి పూర్తిగా తెలియపరిచి వారిని కూడా తనతో పాటు ఇక్కడికి తీసుకురావడం వారు కూడా చికిత్స అనంతరం సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం ఆదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఈ వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9440251969 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

బిచ్చగాడిపై రౌడీషీటర్ దాడి

కార్వాన్ : ఫుట్‌పాత్‌పై పడుకునే విషయంలో ఓ రౌడీషీటర్‌కు, బిచ్చగాడికి మధ్య మంగళవారం అర్ధరాత్రి గొడవ జరిగింది. రౌడీషీటర్.. బిచ్చగాడి ముఖంపై బండరాయితో మోదగా, అతడికి తీవ్రంగా గాయాలయ్యాయి. హుమాయున్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పోచమ్మ బస్తీకి చెందిన రౌడీషీటర్ చోటు(55) కొంతకాలంగా సరోజినిదేవి ఆస్పత్రి సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నాడు. అదే ప్రాంతంలో గుర్తు తెలియని బిచ్చగాడు కూడా అక్కడే పడుకుంటున్నాడు. ఇరువురి మధ్య మంగళవారం రాత్రి నిద్రించే విషయంలో గొడవ జరిగింది. గాయపడిన బిచ్చగాడిని చికిత్స నిమిత్త ఆస్పత్రికి తరలించామని, రౌడీషీటర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రవీంద్రభారతి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండగ పురస్కరించుకొని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఎక్స్‌లెంట్ ఫ్యామిలీ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి కుటుంబాలు, కవులు, పురోహితులు, రచయితలు, ఉపాధ్యాయులు, వైద్యులు, సమాజసేవకులు, వివిధ రంగాల్లోని ప్రతిభావంతులకు అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 6302908528లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం


పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గాజులరామారం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ వైద్యులు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. డివిజన్ పరిధిలోని మెట్కాన్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో మల్లారెడ్డి ఆస్పత్రి డాక్టర్లు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, మురళీకృష్ణ, డాక్టర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో చెరువులు, నాలాలు కబ్జా


రాఘవేంద్రకాలనీలో పర్యటిస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో కూకట్‌పల్లి ప్రాంతంలోని చెరువులు, నాలాలు ఆక్రమణకు గురయ్యాయని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆరోపించారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని సేవాలాల్‌నగర్, ఖైతలాపూర్, రాఘవేంద్ర సొసైటీల్లో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాముని, మైసమ్మ, సున్నం, బోయిని చెరువు స్థలాలు పెద్దఎత్తున కబ్జా అయ్యాయని, దీనిపై పూర్తి నివేదికను ఇప్పటికే ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి అందజేసినట్టు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కబ్జాదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాదయాత్రలో భాగంగా గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరి సతీష్‌రెడ్డి, సాధూ ప్రతాప్‌రెడ్డి, మేకల రమేష్, పుష్పారెడ్డి, సత్యం శ్రీరంగం, తూము వేణు, దినేష్‌కుమార్, కృష్ణరాజ్‌పుత్, ప్రవీణ్, జ్యోతి, రేష్మ, కృష్ణవేణి, రమాదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు


దానం నాగేందర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కృష్ణ తదితరులు

బాలానగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను బాలానగర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కూకట్‌పల్లి ఓబీసీ మాజీ చైర్మన్ సింగజోగు కృష్ణ ఆధ్వర్యంలో నాయకులు నేముల సుదీప్‌పటేల్, దండు మల్లేష్‌గౌడ్, సాయికిరణ్ తదితరులు దానం నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ఫతేనగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడిగా జహంగీర్


జహంగీర్

ఫతేనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఫతేనగర్ డివిజన్ మైనారిటీ అధ్యక్షుడిగా మహ్మద్ జహంగీర్ నియమితులయ్యారు. ఈ నియామకపు ఉత్తర్వులు ఏఐసీసీ మైనారిటీ చైర్మన్ ఇమ్రాన్‌ప్రతాప్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవిని కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, మైనారిటీ అధ్యక్షుడు ఇమ్రాన్ ప్రతాప్‌గిరి, కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలానగర్‌లో ఈటల పుట్టినరోజు వేడుకలు


కేక్ కట్ చేస్తున్న వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు

బాలానగర్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పుట్టినరోజు వేడుకలను పార్టీ డివిజన్ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు జీ.ఆర్. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శివరంజని, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ కుప్పకూలుతోంది: నారగోని

హైదరాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రియల్ ఎస్టేట్ వ్యాపారం 20 ఏళ్ల అధమ స్థాయికి పడిపోయిందని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపార అభివృద్ధికి చర్యలు తీసుకోకపోతే వ్యాపారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఉపాధి కోల్పోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నగరంలో అపార్ట్‌మెంట్లలో లక్షల కొలది ఫ్లాట్లు అమ్ముడుపోక బిల్డర్లు తలలు పట్టుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా హెచ్ఎండీఏ, డీటీసీపీ లేఔట్లు చేసిన వారు అవి అమ్ముడుపోక నిరాశతో ఉన్నారని, ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తీసుకొచ్చే రియల్ ఎస్టేట్ వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

కాలుష్యమయం కట్టమైసమ్మ చెరువు


చెరువులో పేరుకుపోయిన చెత్త

● దుర్గంధం వెదజల్లుతోన్న నీరు ● కుప్పలుతెప్పలుగా ప్లాస్టిక్, వర్థాలు

షాపూర్‌నగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సూరారం కట్టమైసమ్మ చెరువు పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాలుష్యకాసారంగా మారింది. బాలానగర్, గండిమైసమ్మ ప్రధాన రహదారిలో కట్టమైసమ్మ దేవాలయం ఎదురుగా ఉన్న ఈ చెరువులో వ్యర్థాలు, మురుగునీరు చేరడంతో విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం ఈ రోడ్డు నుంచే ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా చెరువు పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. చెరువులో ఎక్కడ చూసినా కుప్పలుతెప్పలుగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కనిపిస్తున్నాయి. వీటి కారణంగా చెరువునీరు దుర్వాసన వస్తోందని గుడికి వచ్చే భక్తులు వాపోతున్నారు. ప్రతీ సంవత్సరం కట్టమైసమ్మ జాతర వైభవంగా నిర్వహించడం, ఈ జాతరకు వేలాది మంది భక్తులు వస్తుంటారు. కానీ చెరువు గురించి నాయకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. చెరువు నుంచి వెలువడుతున్న దుర్వాసన కారణంగా గుడికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణేశ్ నిమజ్జనం సమయంలో విగ్రహాలను ఈ చెరువులో నిమజ్జనం చేస్తుండడంతో చెత్త పేరుకుపోయి కాలుష్యమయంగా మారుతోంది. నిమజ్జనం తర్వాత వ్యర్థాలను తొలగించడంలో అధికారులు అశ్రద్ధ చూపుతున్నారు. దీనికి తోడు కట్టమైసమ్మ చెరువు పక్కనే ఉన్న బతుకమ్మ కుంట సైతం చెత్తతో నిండి పోయి, నీళ్లు కూడా రంగు మారి దుర్వాసన వస్తోంది. బతుకమ్మ కుంట, చెరువును శుభ్రం చేసి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా నాయకులు చూడాలని భక్తులు కోరుతున్నారు.


చెత్తతో నిండి పోయిన బతుకమ్మ కుంట

చెరువును శుద్ధి చేయాలి



ప్రతీ సంవత్సరం గణేశ్ నిమజ్జనం, బతుకమ్మ ఉత్సవాలకు చెరువులో నిమజ్జనం చేసే విగ్రహాలను, బతుకమ్మలతో చెత్త పేరుకుపోతుంది. దీని కారణంగా విపరీతమైన దుర్వాసన వెలువడుతుంది. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. చెరువులో చెత్తను పూర్తిగా తొలగించకుండా తూతూ మంత్రంగా పనులు చేస్తున్నారు. భక్తులను దృష్టిలో పెట్టుకొని చెరువు నీటిని శుభ్రం చేయాలి.

- కోల రవీందర్ ముదిరాజ్, సామాజిక కార్యకర్త

లష్కర్ బరిలో పజ్జన్న?

హైదరాబాద్ సిటీ/సికింద్రాబాద్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్(పజ్జన్న) బరిలో దిగే అవకాశాలున్నాయి. ఈమేరకు పార్టీ అగ్రనేతలు సూత్రప్రాయ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. నేడు లేదా 23వ తేదీ తర్వాత అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అగ్రనేతల సంకేతాల నేపథ్యంలో పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు కంగ్రాట్స్ పజ్జన్న అంటూ.. వాట్సప్ స్టేటస్‌లు పెట్టుకున్నారు. దీంతో ఆయన పేరు ప్రకటించడం లాంఛనమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు పలువురు నాయకుల పేర్లు తెరపైకి వచ్చినా, చివరి నిమిషంలో పద్మారావును బరిలోకి దింపాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. గ్రేటర్‌లో పార్టీకి బలం ఉండడం.. ప్రజలకు తెలిసిన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా విజయావకాశాలు మెరుగవుతాయన్నది పార్టీ యోచనగా తెలుస్తోంది.

తలసాని విముఖత

అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌వాసులు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. 24 స్థానాల్లో 16 చోట్ల గులాబీ జెండా ఎగిరింది. ఈ పరంపరను లోక్‌సభ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పార్టీ భావిస్తోంది. ఈ క్రమంలోనే అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తోంది. సికింద్రాబాద్ నుంచి తలసాని శ్రీనివాస్ యాదవ్ తనయుడు సాయికిరణ్ పోటీ చేస్తారని మొదటి నుంచీ ప్రచారం జరిగింది. పార్టీ అధిష్ఠానం మాత్రం శ్రీనివాస్‌యాదవ్‌ను పోటీ చేయాలని సూచించినట్టు తెలిసింది. అందుకు ఆయన సుముఖంగా లేకపోవడంతో పద్మారావుగౌడ్ వైపు పార్టీ మొగ్గు చూపినట్టు సమాచారం. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ ఎమ్మెల్యేలు గెలిచారు. ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హస్తం గూటికి చేరారు. పార్లమెంట్ స్థానంలో మంచి ఆదరణ ఉందని భావిస్తోన్న పార్టీ.. బలమైన నాయకుడిని పోటీ చేయించడం ద్వారా ఇక్కడ ఖాతా తెరవాలనే తలంపుతో ఉన్నట్టు తెలిసింది. ఈ క్రమంలోనే పద్మారావుకు అవకాశం ఇచ్చినట్టు సమాచారం.



నగర రాజకీయాలతో ఐదు దశాబ్దాల అనుబంధం

నగర రాజకీయాలతో పద్మారావుకు ఐదు దశాబ్దాల అనుబంధముంది. 1973లో దివంగత ఇందిరాగాంధీ సమక్షంలో పద్మారావు యువజన కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం యువజన కాంగ్రెస్ నగర, రాష్ట్ర పదవులు నిర్వహించారు. 1977 నుంచి జంటనగరాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1986లో హిస్సాంగంజ్ మోండా మార్కెట్ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ తరఫున విజయం సాధించారు. 1991వరకు కార్పొరేటర్‌గా కొనసాగారు. 2001లో కేసీఆర్ పిలుపు మేరకు టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. 2002 నుంచి 2004 వరకు మళ్లీ కార్పొరేటర్‌గా ఉన్నారు. 2004లో తొలిసారిగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2014, 2018, 2023లలో కూడా ఆయన అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014 జూన్‌లో తెలంగాణ రాష్ట్ర తొలి ఆబ్కారీ, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2019 నుంచి 2023 వరకు అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. పార్టీలకతీతంగా చాలా మంది నేతలతో పద్మారావుకు సత్సంబంధాలున్నాయి. ఇది ఎన్నికల్లో ఎంత మేరకు ఉపకరిస్తుందన్నది ఆసక్తికరం కానుంది.

మారుతున్న పేర్లు

బీజేపీ నుంచి సిటింగ్ ఎంపీ కిషన్‌రెడ్డి పేరు ఇప్పటికే ఖరారైంది. ఆయన ప్రచారమూ ప్రారంభించారు. ఊహించని పరిణామాలు జరిగితే తప్ప బీఆర్ఎస్ నుంచి పద్మారావుగౌడ్ పోటీ దాదాపు ఖాయమే. కాంగ్రెస్ నుంచి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. మంగళవారం జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగిందని, అధికారిక ప్రకటనే తరువాయి అని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. తొలుత కారు దిగి కాంగ్రెస్ కండువా కప్పుకున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేరు వినిపించింది. ఆయన సన్నిహితులు కూడా టికెట్ తమ నేతకే అని, రెండో జాబితాలో పేరు ఉంటుందని చెప్పారు. రామ్మోహన్ కూడా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. కిషన్‌రెడ్డి, పద్మారావు గౌడ్, నాగేందర్/ రామ్మోహన్‌లో ఎవరు బరిలో ఉన్నా.. ఇక్కడి హోరాహోరీగా త్రిముఖ పోరు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

భవనంపై నుంచి పడి ఏసీ మెకానిక్ మృతి


మృతి చెందిన యశ్వంత్

కూకట్‌పల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవనంపై ఏర్పాటు చేసిన ఏసీ అవుట్‌డోర్ యూనిట్ రిపేర్ చేస్తూ ఓ మెకానిక్ కింద పడి మృతి చెందాడు. ఈ సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీలో నివాసముండే డి.యశ్వంత్(20) ఏసీ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం వివేకానందనగర్ కాలనీలోని ఓ భవనంలోని నాలుగో అంతస్తులో ఏసీ మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. భవనంపై ఉన్న ఏసీ అవుట్‌డోర్ యూనిట్ వద్ద రిపేర్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్రగాయాలైన యశ్వంత్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో అతడి పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.



కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీకి చెందిన ఆరో తరగతి విద్యార్థి అనీష్ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకొన్న అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నీకుమార్ రూ.4 వేల విలువైన పుస్తకాలు బుధవారం అందజేశారు.

- కూకట్‌పల్లి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి


కాలేజీ వివరాలు తెలుసుకుంటున్న క్రిస్టినా చోంగ్తు

మేడ్చల్ మార్చి 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కుత్బుల్లాపూర్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సెక్రటరీ క్రిస్టినా చోంగ్తు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణానికి సంబంధించి ఏర్పాట్లపై కలెక్టర్ గౌతమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు. వైద్య కళాశాల, ఆరోగ్య సంరక్షణ, కచ్చితమైన ప్రణాళికలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా తదితరులు పాల్గొన్నారు.

16 మంది సభ్యుల బృందం సందర్శన

నేషనల్ డిఫెన్స్ కాలేజ్ ఆఫ్ మినిస్ట్రీ, డిఫెన్స్ కోర్స్ ఆన్ నేషనల్ సెక్యూరిటీ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ 16 మంది సభ్యుల బృందం బుధవారం బయాలికల్ ఇండస్ట్రీస్‌ను సందర్శించారు. అనంతరం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టర్‌కు విచ్చేసిన బృందంకు కలెక్టర్ గౌతమ్ సాదర స్వాగతం పలికారు. జిల్లా యొక్క పరిపాలన, వివిధ శాఖల గురించి సభ్యులకు కలెక్టర్ వివరించారు.

ఘనంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం


షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహ

చందానగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): చందానగర్ బీహెచ్ఈఎల్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ షోరూం ప్రారంభోత్సవ కార్యక్రమం ఆ సంస్థ ఫౌండర్ వెంకటరమణ ఆధ్వర్యంలో మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీహీరో రామ్, నటుడు తనికెళ్ల భరణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో సీఎంఆర్‌కు ఓ ప్రత్యేకత ఉందన్నారు. వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైనా సాగుతుందన్నారు. ఎంపీపీ కార్పొరేషన్ జెరిపెటి జైపాల్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో మాల్‌ను స్థాపించడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం సంస్థ ఫౌండర్ వెంకటరమణ మాట్లాడుతూ.. 40 ఏళ్ల నుంచి తెలుగు రాష్ట్రాల ప్రజలు తమను ఆదరిస్తున్నారని, ఇదే మనగడ ముందు ఉండాలని వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌గౌడ్, సంస్థ ప్రతినిధులు బాలాజీ, నాయకులు జెరిపాటి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ విజేత సాహిల్ జోడీ


ట్రోఫీలతో క్రీడాకారులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గేమ్‌పాయింట్ పికిల్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ టైటిళ్లను సాహిల్ జోడీ కైవసం చేసుకుంది. బుధవారం హైటెక్ సిటీలో జరిగిన ఈ పోటీల్లో డబుల్స్‌లో సాహిల్-ధవల్ ద్వయం 15-7తో సిసాఖ్-గురుదీప్ జోడీపై నెగ్గి విజేతగా నిలిచింది. డబుల్స్‌లో సాహిల్-ప్రాచి జంట 16-14తో చరిత-వెంకట్ జోడీపై గెలిచి, టైటిల్ కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో మొత్తం 68 మంది ప్లేయర్లు పాల్గొన్నారు. గేమ్‌పాయింట్ సహ వ్యవస్థాపకుడు సిద్ధార్థ్ రెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

చేవెళ్లగడ్డపై మూడోసారి బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం

మియాపూర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామని పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రకటించారు. రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాసాని జ్ఞానేశ్వర్ నిర్వహించిన సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి నాటి నుంచి చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో బీఆర్ఎస్ పార్టీ గెలుస్తూ వస్తోందని, ఈసారి కూడా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, సబితాఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో ఎమ్మెల్యేలు తదితరులు

నాగదేవత విగ్రహ పునఃప్రతిష్ఠ


నాగదేశత పునఃప్రతిష్ఠ కార్యక్రమం

గచ్చిబౌలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఆదర్శనగర్‌లో రేణుక ఎల్లమ్మ సహిత నాగదేవత విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాధవనంద సరస్వతి పీఠాధిపతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆదర్శనగర్, గోపినగర్, నెహ్రూనగర్‌వాసులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

పరిశోధనలో శాస్త్రీయతలపై పెరుగుతున్న అవగాహన

రాయదుర్గం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం నిత్యం నూతన సత్యాలను ఆవిష్కరించుకోవడం వల్లనే అభివృద్ధి సాధ్యమని, దీనికి మూలం పరిశోధలని, ఆ పరిశోధనలే మానవాళిని మహోన్నత స్థానానికి తీసుకెళ్తున్నామని హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లాలోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమంలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన విశ్వవిద్యాయంలో తెలుగు చదువుతున్న విద్యార్థులకు 'పరిశోధన- మెళకువలు' గురించి అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ గరికపాటి గురజాడ, అధ్యాపకులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ తమలపాకుల అనిల్‌కుమార్, తండ్రి శ్రీ టి. సోమయ్య, వయసు సుమారు 42 సం.లు, వృత్తి: వ్యాపారం, నివాసిత ఇ.నం.90-009/15బి, 3వ అంతస్తు, చింతల్, నారాయణ జూనియర్ కాలేజ్ ప్రక్కన, బాలానగర్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లావారు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ గ్రామం మరియు మండలం వద్ద గల ఇందర్ సింగ్ నగర్, సర్వే నం.లు 28,29,30,31 మరియు 34లో 540 చ.గ.ల విస్తీర్ణం, 600 చ.అ.ల ఎసిసి ప్లింత్ ఏరియాతో ప్లాట్ నం.లు 92 భాగం (తూర్పువైపు పోర్షన్) & ప్లాట్ నం. 91పై గల నం.06-260/ భాగం కలిగిన నివాసిత ఇంటికి పూర్తి యజమానులు, సదరు ఆస్తిని మెసర్స్ అనిల్ ఎంటర్‌ప్రైజెస్, 2. శ్రీ ఠాకూర్ రాజేందర్ సింగ్, 3. శ్రీమతి ఠాకూరు జ్యోతిబాయి అలియాస్ ఠాకూర్ జ్యోతిభాయ్, 4. శ్రీ ఠాకూర్ మహేందర్ సింగ్ ద్వారా ప్రాప్తించబడిన కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నమోదైన విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నం. 14295 ఆఫ్ 2021 తేది: 24.04.2021 ద్వారా కొనుగోలు చేశారు.

నా క్లయింట్ పేర్కొనేది ఏమనగా ఒరిజినల్‌గా ఆస్తి యొక్క పూర్తి యజమానులైన శ్రీ ఠాకూర్ సురేందర్ సింగ్ మరియు శ్రీ ఠాకూర్ రాజేందర్ సింగ్ వారు మెసర్స్ అనిల్ ఎంటర్‌ప్రైజెస్ పేరున హైదరాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నమోదైన జిపిఎ నం. 738/1988లో కుదుర్చుకున్నారు. మరియు తదనుగుణంగా మెసర్స్ అనిల్ ఎంటర్‌ప్రైజెస్ వారు ఆస్తిని స్వాధీన పరుచుకున్నారు, ఎటువంటి అభ్యంతరం లేకుండా ఆస్తికి పూర్తి యజమానులైనారు. ప్రస్తుతం శ్రీ ఠాకూర్ సురేందర్ సింగ్ వారు 21.07.2006న మరణించినందున అతని భార్య అనగా శ్రీమతి ఠాకూరు జ్యోతిబాయి అలియాస్ ఠాకూర్ జ్యోతిబాయ్‌వారు ఏకైక న్యాయవారసులుగా ఉన్నారు.

నా క్లయింట్ ముందు జాగ్రత్తతో తన టైటిల్‌ను కొనసాగించడానికి అసలైన యజమానులతోపాటు జిపిఎ హోల్డర్ నుంచి ఆస్తిని కొనుగోలు చేశారు. నా క్లయింట్ ఎస్ఎంఎఫ్‌జి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ నుండి రుణ సదుపాయం పొందదలిచారు. దీనికి సంబంధించి సాధారణ ప్రజలను మేము అభ్యర్థించదమేమనగా సదరు ఆస్తికి సంబంధించి ఏదేని స్వభావం గల ఏదేని ఆక్షేపణలు లేదా ఏదేని క్లెయిములు కలిగిన ఎవరైన వ్యక్తి లేదా వ్యక్తులు ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపు సంబంధిత డాక్యుమెంట్లతో ముందస్తు అనుమతితో దిగువ సంతకందారుని ఉ.10.30 గం.నుండి సా.5.00గం.ల మధ్యన కలవగలరు. ఆ తరువాత ఏదేని ఆక్షేపణలు/క్లెయిములు స్వీకరించబడవు మరియు రద్దు అయినట్లుగా భావించబడును.

షెడ్యూల్ ఆస్తి: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, కుత్బుల్లాపూర్ గ్రామం మరియు మండలం వద్దగల ఇందర్ సింగ్ నగర్ సర్వే నం.లు 28,29,30,31 మరియు 34లో 540 చ.గ.ల విస్తీర్ణం, 600 చ.అ.ల ఎసిసి ప్లింత్ ఏరియాతో ప్లాట్ నం.లు 92 భాగం (తూర్పువైపు పోర్షన్) & ప్లాట్ నం. 91పై గల నం.06-260/ భాగం కలిగిన నివాసిత ఇల్లు యావత్తు.

ఎం. శ్రీలేఖ, అడ్వకేట్, ఇ.నం.2-2-1132/7, శివం రోడ్, న్యూ నల్లకుంట, హైదరాబాద్-500044, సెల్: 9177483084

బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గెలుపు కోసం కృషి

దుండిగల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగిన బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం దుండిగల్ మున్సిపాలిటీలోని శంభీపూర్ ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, పలువురు బీఆర్ఎస్ నాయకులను, కార్పొరేటర్లను సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు అందరం కలిసికట్టుగా కృషి చెయ్యాలని తీర్మానించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ల అధ్యక్షులు పాల్గొన్నారు.


రాగిడి లక్ష్మారెడ్డితో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కార్పొరేటర్లు

మల్కాజ్‌గిరిపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

కూకట్‌పల్లి: బీఆర్ఎస్ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌తో పాటు నియోజకవర్గ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షుడు, ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించేలా కృషి చేయాలని కోరారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366